Ananth & Ananth Series



An Accomplished Author With World-Wide Releases Of Two Of His English Novels "The Enemy of the Mankind" and "The Dictator of the Dark"

## సూర్యదేవర రామ్ మోహన రావు



# డ్రీమ్స్

# డ్రీమ్స్

-సూర్యదేవర రామ్‌మోహనరావు

# డ్రీమ్స్

సుమిత్ర దురుసుగా మేడమీద గదిలో కొచ్చేసరికి–

ఉదయం సరిగ్గా ఎనిమిది గంటలు.

అప్పటికింకా అతను దుప్పటి ముసుగు తన్ని నిద్రపోతూనే వున్నాడు.

పక్కన టీపాయ్ మీద ఒక ఖాళీ విస్కీ బాటిల్, పక్కన కొద్దిగా విస్కీతో మిగిలివున్న గ్లాసు, వాటర్ జగ్గు పడున్నాయి. సీలింగ్ ఫ్యాన్ ఫుల్ స్పీడ్‌తో తిరుగుతోంది.

విసుగునంతా ముఖంలో నింపుకుని చూసిందతడ్ని.

"నాకు తెలుసు! ప్రపంచం తల్లకిందులయినా వచ్చి లేపేవరకు నువ్వు లేవవని... భార్గవ్... ఏయ్ భార్గవ్... లేలే" అనరుస్తూ వెళ్ళి ఫ్యాన్ ఆఫ్ చేసింది. కిటికీ గ్లాస్‌డోర్స్ తెరిచి స్క్రీన్స్ పక్కకు లాగింది. బయటి నుంచి చలిగాలి జివ్వున లోనకు ప్రవేశించింది.

అసలే మాంచి శీతాకాలం.

బయటి పొగమంచు ఇంకా తగ్గలేదు.

సిటీ అంతటా అప్పుడే తెల్లవారినట్టుంది.

అంత అరిచినా అతడు కదలకపోడం చూసి–

విసవిసా బెడ్ పక్కకెళ్ళి నడుంమీద చేతులుంచుకుని కోపంగా చూసిందామె.

"భార్గవ్.... మర్యాదగా లేస్తావా– బకెట్‌తో నీళ్ళు తెచ్చి పొయ్యమంటావా... లేస్తున్నావా లేదా?" అంటూ గద్దించింది.

ఆమెకు ఇవరై మూడు సంవత్సరాల వయసు.

అయిదు, నాలుగు అంగుళాల ఎత్తున దబ్బపండు రంగులో జపాన్ బొమ్మలా వుంది. చారడేసి కళ్ళు, ఆపిల్ బుగ్గలు, సన్నటి నడుం, ఎత్తుపల్లాలు సమతూకంలో వుండి మగాడి చూపుల్ని తనవైపు లాక్కునే ఆకర్షణ వుంది ఆమెలో. అంతేకాదు, చక్కటి మాటకారి. వసపోసిన పిట్టలా గంటలతరబడి మాట్లాడగలదు.

జీన్స్‌పాంటు, షర్టు వేసుకుంది. పోనీటెయిల్, ముక్కుమీద కళ్ళజోడు ఆమె అందానికి మరింత వన్నె తెస్తున్నట్టున్నాయి. ఆమె గదిలోకి వచ్చిందంటేనే ఉరుములు, మెరుపులతో వర్షం పడుతున్నట్టేనని అతడికి తెలుసు. ఆమె ఇలా కాలు లోనపెట్టిందో లేదో అలా మెలుకువ వచ్చేసిందిదతడికి.

"సుమీ... ప్లీజ్! కాసేపు నిద్రపోనీ. గొడవ చేయకు" అన్నాడు ముసుగులోంచే.

"ఏమిటీ! నేను గొడవ చేస్తున్నానా? అంటే నా మాటలే కన్పిస్తున్నాయి గానీ నీ చేతలు కనబడ్డం లేదా? ఈరోజు కొత్త బాస్ వస్తున్నారు. తొమ్మిది గంటలకే అంతా ఆఫీసులో వుండాలని జి.ఎం. చెప్పారు. మర్చిపోయావా?" గద్దించింది.

"అబ్బా! పొద్దుటే చంపకురా. అంతా గుర్తుంది. ఇలాంటి ప్రాబ్లం వస్తుందనే రాజీనామా యిస్తే ఆ ఎం.డి.గాడు ఒప్పుకోలేదు. రానీ... కొత్త బాస్‌కి నా అలవాట్లు తెలిసయినా ఉద్యోగంలోంచి పీకేస్తాడేమో చూద్దాం. నేవస్తాలే, నువ్వెళ్ళు." అన్నాడు.

"ఓహో! అయితే దొరగారికి మళ్ళీ ఉద్యోగం మానేయాలని సరదా పుట్టిందన్నమాట. అయితే ఇకనే! బాగుపడ్డట్లే. ఏరా! ఏమిటి కథ? రాత్రి మందు ఎక్కువైందా? నువ్వు తాగటం మానవా?"

"మానలేనని నీకూ తెలుసు కదరా. ఎందుకు ప్రాణం తీస్తావ్. పొద్దుటే క్లాస్ తీసుకోడం ఆపి వెళ్లి పని చూసుకో... వెళ్ళు" కసురుకున్నాడు.

ఆ మాటతో రెచ్చిపోయిందామె.

కోపంతో ముక్కుపుటాలు అదిరాయి.

"వెళ్ళాలా... ఆగు నీ పని చెప్తా" అంటూ దుప్పటి చెంగు పట్టుకుని సర్రున లాగేసింది. అదిరిపడి వెంటనే పట్టుకున్నాడు గాని లేదంటే దుప్పటి మొత్తం వచ్చేసేదే.

"ఓర్నాయనో... అమ్మా తల్లీ... అన్యాయం చేయకు... దుప్పటి వదులు. ప్లీజ్" అన్నాడు బ్రతిమాలుతూ.

"వదలను. లే ముందు" వార్నింగ్ యిచ్చింది.

"ఇదదిగో సుమీ. ప్లీజ్! లోన లుంగీ ఏ పరిస్థితిలో వుందో నాకే తెలీదు. ఇప్పుడు దుప్పటి లాగి అనవసరంగా నువ్వు కంగారుపడి నన్ను కంగారుపెట్టకు. వదిలేయరా... ప్లీజ్!" బిక్కమొహంతో దీనంగా అడిగాడు.

ఆ మాటతో ఫక్కున నవ్వేసి దుప్పటి వదిలేసింది.

దుప్పటిని నడుం మీదకు లాక్కుని బాసిపట్టు వేసుక్కూచున్నాడతను. ఆరడుగుల అందగాడు. చక్కటి ఎరుపు రంగులో హీమ్యాన్‌లా వున్నాడు. సుమారు ఇరవై ఏడు సంవత్సరాలు వయసు. సూదంటురాయిలా ఎదుటి వాళ్ళను ఆకర్షించే కళ్ళు, సన్నటి వంకీల జుత్తు. లేదంటే ఆ ముఖంలో ప్రస్తుతం నిర్లక్ష్యం, ఉదాసీనత చోటు చేసుకున్నాయి. కొద్దిగా పెరిగిన గెడ్డం, చింపిరి జుత్తు. విశేషం ఏమంటే, అతను ఆమె ఇద్దరూ ఒకే కంపెనీలో పనిచేస్తున్నారు.

అతని చిరునవ్వంటే ఆమెకు చాలా ఇష్టం.

ఎర్రటి పెదవులమీద చిరునవ్వు పూచీపూయగానే బుగ్గలమీద పడే నెలవంకలాంటి సొట్టలంటే మరీ ఇష్టం. అతను చేయి చాపబోతుంటే తనే టీపాయ్‌మీది సిగరెట్ పాకెట్, అగ్గిపెట్టె అందించింది.

అతను సిగరెట్ ముట్టించుకున్నాడు.

బెడ్ పక్కనే మోకాళ్ళ మీద కూచుని చుబుకంమీద చేయి ఆన్చుకుంటూ నిష్టూరంగా చూసింది. "ఊఁ! ఆ సిగరెట్‌పాటి అదృష్టం కూడా నాకు లేదు. వెధవది! కాలిపోయేదానికి అన్ని ముద్దులు పెడతావ్. నీ కోసం పడి చస్తున్నానే! అందులో ఒక ముద్దు నాకు పడేస్తే ఎంత సంతోషిస్తాను" అంది కొంటెగా.

"వద్దు! సంతోషించకు. ఎందుకంటే నిన్ను నేను ప్రేమించటం లేదు కదా" అన్నాడు.

"వద్దులే! ప్రేమించకు. పెళ్ళిచేసుకో."

"అదీ కుదరదు. ఎందుకంటే నేను జీవితంలో పెళ్ళి చేసుకోను"

"ఓకే! చేసుకోకు. వుంచుకో. నీకు వుంచుకోడానిక్కూడా నేను పనికిరానా?"

"ఛ! ఉండేకొద్దీ నీకు సిగ్గు లేకుండా పోతోంది."

"నీ ముందు నాకు సిగ్గేమిటి? ప్రేమించిన వాడిముందు సిగ్గుపడితే జీవితంలో ఏ అమ్మాయి సుఖపడలేదు. ఎక్కడ దుప్పటి లాగేస్తానోనని నువ్వు భయపడ్డావ్. నీ ముందు నాకా భయం లేదు. కావాలంటే చెప్పు! మొత్తం విప్పేస్తాను."

నెత్తి కొట్టుకున్నాడు భార్గవ్.

"పొద్దుటే నీతో మాట కలిపాను చూడు! నాది ఖర్మ. వేళాకోళం ఆపి ఇక వెళ్ళు" అన్నాడు.

అతడి చేయి అందుకుని మృదువుగా నిమురుతూ కళ్ళలోకి చూసింది.

"ఏరా... ఇంత చెప్పినా నా మాటలు నీకు వేళాకోళంగా అన్పిస్తున్నాయా? నా గుండె చప్పుడు నీకు విన్పించటం లేదా? ఆ చప్పుడులో ప్రతిధ్వనిస్తున్న నీ పేరును గుర్తించలేదా? నా ప్రేమ నీకు వేళాకోళమైపోయిందా? చెప్పరా... నన్నింకా ఎంతకాలం ఎదురుచూడమంటావ్? జీవితమంతానా?" పొంగుతున్న కన్నీళ్లను బలవంతంగా ఆపుకుంటూ అతడి చేతిని ముద్దుపెట్టుకుంది.

ఆప్యాయంగా ఆమె తల నిమిరాడు.

బాధగా చూశాడు.

"ఏయ్... బయటపడిపోయావ్ చూశావా? నువ్వు నన్ను ప్రేమిస్తున్నావ్. నాకు తెలుసు. కాని నేను ప్రేమించ లేకపోతున్నాను. ఎందుకంటే, ఒకసారి ప్రేమ అనే కత్తి నా గుండెను గాయం చేసింది. అందులోంచి నేను బయటపడలేను. ఆ గాయం ఆరదు. సో... నీ మనసుని, వయసుని నా కోసం వేచివుంచటం వృథా. మనం మంచి స్నేహితులం. యూ ఆర్ మై బెస్ట్ ఫ్రెండ్. ఈ ప్రపంచంలో నాకు ఆత్మీయులంటూ వుంటే ఖచ్చితంగా అది నువ్వే. స్నేహం తప్ప నీకేమీ యివ్వలేను. సారీ!" అన్నాడు.

"నువ్వు అబద్ధాలు చెప్తావని నాకు బాగానే తెలుసు."

"అబద్ధం చెప్పానా. ఏమిటది?"

"నేను నిజంగా నీకు ఆత్మీయురాలినైతే, నీ గురించిన నిజాలు నా దగ్గర దాచవు. నాకు పరిచయమైన ఆ రోజు నుంచి ఈ రోజు వరకు నాకో ప్రశ్నగానే మిగిలిపోయావ్. నీ గురించి ఏమీ చెప్పలేదు"

"సమయం వచ్చినప్పుడు చెప్తాను."

"ఆ సమయం ఎప్పుడు... అది రాదు. నువ్వు చెప్పవు. చివరికి ఏ ప్రైవేట్ డిటెక్టివ్‌నో నియమించి నేను నీ వివరాలు సేకరించాలి.

"నీకా శ్రమ అక్కర్లేదు సుమీ... త్వరలోనే నేను వెళ్ళిపోవాలనుకుంటున్నాను"

షాక్‌తో క్షణకాలం అతడ్నే చూస్తుండిపోయింది.

"వెళ్ళిపోతావా... ఎక్కడికి?" అంది.

"ఏమో... ఎక్కడికైనా కావచ్చు."

"ఎందుకు వెళ్ళిపోవాలి?"

"ప్చ్.... ఏమో నాకే తెలీదు."

ఆ మాటతో కోపం వచ్చేసిందామెకు.

ఎంత కోపమంటే... తట్టుకోలేనంత పిచ్చి కోపం.

చివ్వున లేచింది.

"తెలీదురా... నీకేమీ తెలీదు. కాని వెళ్ళిపోతావ్... నన్నొదిలి వెళ్లిపోతావు. అంతేగా! చెప్పరా... వెళతావా? నిన్ను... నిన్ను చంపేస్తాను. నిన్ను చంపి నేనూ ఛస్తాను. నిన్ను వదలను" అంటూ అతడి జుత్తు పట్టుకులాగేసింది.

వెనక్కి గెంటి మీదపడి రక్కింది.

అతడి గుండెలమీద కూచుని గొంతు పట్టుకుంది.

"వెళతావా? చెప్పు... నన్నొదిలి వెళ్ళిపోతావా?" అంటూ అరుస్తుంటే భార్గవ్‌కి నవ్వొచ్చేసింది. నవ్వుతూనే వున్నాడు. అతడు నవ్వేకొద్దీ రెచ్చిపోయింది సుమిత్ర.

"నవ్వుతావా... నీకు నవ్వులాటగా వుందా? నన్నేడిపించటమే సరదా అనుకుంటున్నావా? నిజంగానే చంపేస్తాను" అంటూ గుప్పిళ్ళతో ఛాతీమీద గుద్దింది. ఆమె చేతుల్ని ఒడిసి పట్టుకుంటూ నవ్వాపుకున్నాడు. "వెళ్ళనులే సుమీ... ప్లీజ్ కూల్‌డౌన్" అన్నాడు.

ఉన్నట్టుండి ఏడ్చేస్తూ అతడిమీద వాలిపోయింది సుమిత్ర.

"లేదు! నీ మనసులో ఏదో వుంది. అందుకే వెళ్ళిపోతానంటున్నావ్" అంది ఏడుస్తూనే.

"ఏమీలేదు. వెళ్ళనంటున్నాగా!"

"నమ్మను... ఏదోరోజు నాకు చెప్పకుండా వెళ్లిపోతావ్! అలా వెళితే నువ్వెక్కడున్నా నా చావు కబురు అందుతుంది."

"ఏయ్... ఇప్పుడేమైందని. ఏమిటా మాటలు?"

"మాటలు కాదు భార్గవ్! నా మనసులో భయం. నిన్ను చూడకుండా వుండలేను. నువ్వు లేకుండా బ్రతకలేను. ఐ లవ్ యూ భార్గవ్. ఐ లవ్ యూ" అంటూ అతడి తలను లాగి గుండెలకు హత్తుకుని చేతుల్ని మెడకు చుట్టేస్తూ ఏడ్చేసింది.

"చెప్పు భార్గవ్! ప్లీజ్... వెళ్ళనని నామీద ఒట్టు వేసి చెప్పు. నువ్వు నన్ను ప్రేమించకపోయినా యిష్టమే, పెళ్ళి చేసుకోకపోయినా యిష్టమే! మన గురించి నలుగురూ ఏం చెప్పుకున్నా యిష్టమే. కాని నువ్వు వెళ్ళిపోతే ఈ పాడు గుండె తట్టుకోలేదు. నన్నొదిలి వెళ్ళొద్దు భార్గవ్. నువ్వు నా కళ్ళ ముందుంటే చాలు" అంటూ ఏడ్చేస్తున్న ఆమెను ఎలా ఓదార్చాలో భార్గవ్‌కి అర్థంకాలేదు.

నిజంగానే ఓ రోజు చెప్పకుండా వెళ్ళిపోవాలనే వుద్దేశంలో వున్నాడు.

ఆమె ప్రేమను అర్థం చేసుకోగలడు.

ఆమె తనను ఆదరించింది. ఇంట్లో చోటిచ్చింది. గుండెల్లో దాచుకుంది. ఉద్యోగం యిప్పించింది. ఇంత చేసిన ఆమెకు తను ఏమీ చేయలేకపోతున్నాడు. తను సుఖంగా వుండాలంటే వెళ్ళిపోడం మంచిదనుకున్నాడు. కాని తను వూహించిందానికన్నా ఎక్కువగా ఆమె తనని ప్రేమిస్తోంది, తట్టుకోలేకపోతోంది. ఈ బంధం ఏ నాటిది! భగవంతుడు ఎందుకిలా ముడులువేసి ఆనందిస్తాడో అర్థంకాదు. అతడి కంటి కొనల్లో నీరు సుడితిరిగింది.

"నీకు ఇష్టంలేకపోతే ఉద్యోగం మానేయ్ భార్గవ్! ఇంట్లోనే వుండు. నీకేలోటు రాకుండా నేను చూసుకుంటాను. కాని నా గుండెల్ని చితక్కొట్టి ఈ ఇంట్లోంచి వెళ్ళిపోయే పనిమాత్రం చేయకు. నువ్వు నా కంటిముందుంటే చాలు. వుంటావుగా? చెప్పు భార్గవ్... ఉంటావుగా?" అంటూ ఆపుకోలేని ప్రేమతో అతడి బుగ్గల్ని ముద్దు పెట్టుకుంది.

అతను వారించే లోపలే–

అందమైన ఆమె పెదవులు అతడి అధరాలిని అదిమేశాయి.

ఘాటు ముద్దు.

క్షణకాలం శరీరం అదుపుతప్పింది.

నునువెచ్చని తీపిముద్దు అతడి నిగ్రహాన్ని సవాల్ చేసింది.

మరొపక్క ఆమె పరువపు పొంగులు మెత్తగా ఛాతీకి అదిమేస్తున్నాయి. పువ్వులా మీదకు వచ్చిన ఆ సుకుమారిని సున్నితంగా తప్పించుకోడానికి ముఖం తిప్పుకున్నాడతను.

"ఓకే బేబీ! వెళ్ళను... ఎక్కడికీ వెళ్ళను సరేనా! లేవరాబాబు! నీ బరువుతో నిజంగానే చచ్చిపోయేలా వున్నాను" అన్నాడు వాతావరణాన్ని తేలిక చేయటానికి నవ్వేస్తూ.

ఆమె లేచి కూర్చుంది.

కాని అతడిమీంచి దిగలేదు.

జీన్స్‌ప్యాంటులోంచి ఆమె బలమైన వురువులు అతడి ఛాతీని అటు యిటు మెత్తగా అదిమేస్తున్నాయి. కళ్ళజోడు తీసి కళ్ళు తుడుచుకుంటూ సీరియస్‌గా చూసింది.

"నిన్ను చూస్తే నాకు చాలా కోపంగా వుంటుంది. ప్రపంచంలో ప్రేమ ఫెయిలైన వాళ్ళంతా నీలాగే భగ్న ప్రేమికులుగా మిగిలిపోతున్నారా? ఐ హేట్ యూ" అంటూ అతడ్నుంచి పక్కకు దిగి బెడ్‌మీద కూర్చుంది.

చిన్నగా నవ్వుతూ ఫ్రెష్‌గా మరో సిగరెట్ ముట్టించాడు.

"మళ్ళీ అదే చిరునవ్వు. నన్ను చూస్తే పిచ్చిదాన్లా కనబడుతున్నానా? చూస్తుండు! నువ్వు నన్ను ప్రేమిస్తావ్! నీ మనసులో నాకు స్థానం దొరుకుతుందన్న నమ్మకం నాకుంది" అంది.

"నమ్మకు. ఓడిపోతావ్!" హెచ్చరించాడు.

"చూడు సుమీ! హృదయమనేది ఓ కుండలాంటిది. వద్దనుకుంటే కుండలో పాతనీరు వంపేసి మళ్ళీ నీరు నింపుకోవచ్చు. కాని హృదయం అలా కాదు. ఓసారి నిండిపోతే ఇక ఖాళీ అవదు. నా హృదయంలో నిండుగా ఓ రూపం వుంది. అది చెరిగిపోదు."

"అర్థంలేకుండా మాట్లాడకు భార్గవ్! ఇప్పుడీ విస్కీ బాటిల్‌నే చూడు. ఇది నీ గుండె అనుకో. నిన్న ఇది ఫుల్‌గా విస్కీతో వుంది. రాత్రి తాగేశావు. ఇప్పుడు ఖాళీగా వుంది. మళ్ళీ ఫిలప్ చేసుకోవచ్చు. చూస్తుండు! ఏదోరోజు ఈ విస్కీలాగే నేను నీ గుండెల్లో ప్రవేశిస్తాను."

"ఓకే! ఓకే! నీతో వాదించలేను. వాదించి నెగ్గలేను. బట్! నీకేమీ యివ్వలేకపోతున్నాననే బాధ నాకుంది. ఐయాం సారీ! టైమైంది ఇక బయల్దేరు. నేనూ వచ్చేస్తాను."

"ఎంతసేపట్లో వస్తావ్?" వెంటనే అడిగిందామె.

"ఓ గంటలో...."

"ఇంకా ముందు రాకూడదూ. వాళ్ళతో ఎందుకొచ్చిన గొడవ. యాజమాన్యం మారింది. కొత్త ఓనర్, కొత్త బాస్."

తల అడ్డంగా వూపుతూ సిగరెట్ యాష్‌ట్రేలో కుక్కాడు.

లుంగీ సరిగా కట్టుకుంటూ బెడ్ దిగాడు.

"ముందురోజు టైంకి వచ్చి తర్వాత వెళ్ళకపోతేనే గొడవ. నా అలవాట్లు నాకున్నాయి. అది నచ్చకపోతే నో ప్రాబ్లం. నేనే మానేస్తాను. పోషించటానికెలాగూ నువ్వున్నావ్‌గా" అంటూ నవ్వేశాడు.

తనూ నవ్వేస్తూ కళ్ళు తుడుచుకుంది.

"నిన్ను మార్చటం నావల్ల కాదు గాని జగమొండివి. నీ ఇష్టం వచ్చినప్పుడేరా! నే బయల్దేరుతున్నాను. నీ కోసం హాట్‌పాక్‌లో టిఫిన్, ఫ్లాస్క్‌లో కాఫీ వుంచాను. అమ్మపైకి రాలేదు తెలుసుగా! నువ్వే డైనింగ్ రూంకెళ్ళి తిని రా! మర్చిపోవద్దు" గుర్తు చేసింది.

"అలాగే!"

ముక్కుమీద కళ్ళజోడు సర్దుకుని డోర్‌వైపు అడుగులేసింది.

క్షణం ఆమెనే చూస్తుండిపోయాడు.

"సుమీ...." చిన్నగా పిలిచాడు.

"ఊఁ!" అంటూ డోర్ వద్ద ఆగి తిరిగి చూసింది.

"అయాం సారీరా... ప్రతిసారీ నిన్ను ఏడ్పిస్తూనే వున్నాను. నామీద నాకే కోపంగా వుంది. అయామె ఫూల్" చిన్నగా చెప్పాడు.

చెర్రీ పండ్లలాంటి ఆమె పెదవుల మీద–

అందమైన చిరునవ్వు పూసింది.

"వద్దురా! సారీ చెప్పకు. ఎందుకంటే నేను నీ దాన్ని. దేవుడికి పూజచేసి నైవేద్యం పెట్టడంవరకే మనవంతు. ఆ పూజను స్వీకరించేది లేనిది అది భగవంతుడి ఇష్టం. ఇదీ అంతే! నీకు నామీద ఇష్టం ఏర్పడేవరకు... ఈ జన్మంతా ఎదురుచూస్తాను. డోంట్‌వర్రీ!" అని చెప్పి విసవిసా బయటకు వెళ్ళిపోయింది.

చివరిగా ఆమె చెప్పిన మాటలు–

అతని గుండెలకు సూటిగా తాకాయి.

క్షణకాలం విలవిల్లాడింది మనసు.

చాలాసేపు ఆలోచిస్తూ అలాగే బెడ్‌మీద కూర్చుండిపోయాడు.

కింద ఆమె స్కూటీ వెళ్ళిపోతున్న శబ్ధం విన్పించింది.

సుమిత్రకు ఏమిచ్చినా తను రుణం తీర్చుకోలేడు.

కాని ఏమీ ఇవ్వలేకపోతున్నాడు.

గతం నుంచి తన మనసు బయటపడలేకపోతోంది.

ఒకరితో చెప్పుకోలేడు. తను దాచుకోలేడు. అదీ తన బాధ. ఆమె తన మదిలో గుడికట్టి ఆరాధించిన దేవత... ఆ రూపాన్ని ఆ క్షణాల్ని ఎంత ప్రయత్నించినా మర్చిపోలేకపోతున్నాడు. మర్చిపోడానికే చీకటిపడగానే విస్కీని ఆశ్రయిస్తాడు. లేకపోతే నిద్ర పోనివ్వదు. ప్రపంచం దృష్టిలో తను చచ్చిన మనిషి. సుమిత్ర దృష్టిలో తనో దేవుడు. ఒకరు తనని చంపేశారు. ఇంకొకరు బ్రతికించారు. విచిత్ర జీవితం... తను ఎవరికీ సొంతం కాలేకపోతున్నాడు.

సుమారు పదకొండు గంటలకి తన బైక్ మీద ఆఫీస్‌కి బయల్దేరాడు.

✦ ✦ ✦ ✦ ✦

భార్గవ్ ఆఫీస్‌లో అడుగుపెట్టేసరికి–

సరిగ్గా పదకొండు ఇరవై నిమిషాలైంది.

అక్కడికి రాగానే ఎదురొచ్చాడు ఆఫీస్ ఇన్‌ఛార్జ్ వెంకట్రామయ్య.

"అబ్బా! ఈ రోజు కూడ లేటేనా మిస్టర్ భార్గవ్. మైగాడ్! ఇప్పుడు కూడ తాగి వచ్చావా...?" ఆశ్చర్యంగాను, కంగారుగాను అడిగాడతను. వయసులో భార్గవకన్నా పదేళ్ళు పెద్దవాడాయన.

"కంగారుపడకండి సార్! ఇది రాత్రి తాగిన ఎఫెక్ట్. ఇప్పుడేం లేదులే" అంటూ నవ్వేశాడు.

"హమ్మయ్య! బతికించావ్. అయినా యాజమాన్యం మారింది. కొత్త బాస్ ఈరోజు వస్తున్నట్టు తెలుసు. కాస్త పెందలాడే రావాలని తెలీదూ! నీ గురించి అంతా తెలుసు గాబట్టి పాతవాళ్ళతో ఏ చిక్కూ వుండేది కాదు. ఇప్పుడు చూడు– మార్కెటింగ్ మేనేజర్ ఎక్కడని బాస్ ఇప్పటికి పదిసార్లు అడిగాడు. ముందువెళ్ళి అక్కడ కన్పించిరా" అంటూ హెచ్చరించాడాయన.

భార్గవ అటు అడుగులేస్తూ దూరంగా వున్న సుమిత్ర సీటువంక చూశాడు. ఆమె కంప్యూటర్ ముందు చాలా బిజీగా వుంది. అయినా అతణ్ణి చూసి చిరునవ్వు నవ్వింది.

భార్గవ బాస్ ఛాంబర్ ముందుకు వెళ్ళేసరికి ప్యూన్ వెంకన్న చిరునవ్వు నవ్వాడు. "మిమ్మల్ని మార్చటం ఎవరితరం కాదు బాబు. లోనకెళ్ళండి. మీకోసం ఎదురుచూస్తున్నారు. ఎందుకయినా మంచిది సెక్రటరీ సరళమ్మగారి పర్మిషన్ తీసుకోండి. ఇప్పుడు రూల్స్ మారిపోయాయి మరి" అంటూ పళ్ళికిలించాడు.

పక్క టేబుల్ సెక్రటరీది. అప్పటికే ఆమె భార్గవని చూసి ఇంటర్‌కంలో బాస్‌కి చెప్పి పర్మిషన్ తీసుకుంది.

"బాస్ రమ్మంటున్నారు. మీరు లోనకెళ్ళండి మిస్టర్ భార్గవ్" అంది పొలైట్‌గా.

"థాంక్యూ!" అంటూ స్ప్రింగ్ డోర్ నెట్టుకుని లోనకు అడుగుపెట్టాడతను.

ఆ ఛాంబర్ అతడికి కొత్తకాదు.

కాని బాస్ కొత్త.

గత యాజమాన్యం కంపెనీ లాభాల్లో నడుస్తున్నప్పటికి ఫారెన్‌లో సెటిల్ కావాలని వెళ్లిపోతూ కంపెనీ వేరేవాళ్ళకి అమ్మేశారు. ఈ రోజునుంచి ఆఫీస్ కొత్త యాజమాన్యం హ్యాండ్‌లోకి వచ్చింది.

చలువరాతి విశాలమైన గది.

ఎటు చూసినా ఖరీదైన ఫర్నీచర్.

ఎ.సి. ఆన్‌లో వుంది. జిల్లున వుంది లోన. ఎ.సి. మెషిన్ సౌండ్ తప్ప చీమ చిటుక్కుమన్నా విన్పించేంత నిశ్శబ్దం. అతడు లోనకు వెళ్ళేసరికి రౌండ్ టేబుల్ వెనక రివాల్వింగ్ చైర్‌లో అటు తిరిగి కూచుని ఎవరికో ఫోన్ డయల్ చేస్తున్నాడు కొత్త బాస్. చైర్ తలకు పైవరకు ఎత్తుగా వున్నందున చైర్‌లో పర్సన్ కన్పించటం లేదు. టేబుల్ మీద గుట్టలుగా నిలబడున్నాయి ఫైల్స్. మొత్తం చెక్ చేస్తున్నట్టున్నాడు.

పొడిగా దగ్గుతూ– "గుడ్‌మార్నింగ్ బాస్" అన్నాడు.

"వెరీ బ్యాడ్ మార్నింగ్!" వెంటనే వచ్చింది కరుగ్గా అవతలి నుంచి స్త్రీ కంఠం.

ఆ గొంతు విని నొసలు విరిచాడు.

డామిట్... బాస్ అంటే ఎవరో మగాడు అనుకున్నాడు. సీట్లో లేడీ వున్నట్టుంది. వున్నట్టేమిటి ఖర్మ! లేడియే.

"మిస్టర్ భార్గవ్! మీరు ఆఫీస్‌కు వచ్చే టైమ్ యిదేనా? ఇది ఆఫీస్ అనుకుంటున్నారా లేక యిష్టం వచ్చినప్పుడు వచ్చిపోడానికి ఇదేమన్నా ప్లేగ్రౌండ్ అనుకుంటున్నారా? బాధ్యతగల మార్కెటింగ్ మేనేజర్ పోస్ట్‌లో మీరున్నారు."

ఆమె ఫోన్‌లో ఏదో నెంబర్ ట్రై చేస్తూనే మాట్లాడుతోంది. నెంబర్ దొరకట్లేదనుకుంటూ– మళ్ళీ మళ్ళీ ట్రై చేస్తోంది. భార్గవ్‌కి ఆమె మాటలు విన్పించటం లేదు. ఆ గొంతు... వేయి మందిలో వున్నా తను గుర్తించగల ఒకే ఒక గొంతు... మైగాడ్! ఆమె కాదుగదా... అరచేతులు చెమటలు పట్టాయి. జీవితంలో ఎవరి ముఖమైతే చూడకూడదనుకున్నాడో ఆవిడ... ఇక్కడ.... తన ముందు... మైగాడ్... ఇదెలా సంభవం... ఇంత మధురమైన గొంతు, ఎదుటివాళ్ళని ఎంతగా మంత్రముగ్ధుల్ని చేయగలదో అంతకుమించి శాసించగల గొంతు. తను పొరబాటు పడ్డం లేదు గదా... ఆమె కాదు గదా?

అక్కడి నుంచి వెంటనే పారిపోతే బాగుంటుందాని ఓ పిచ్చి ఆలోచన క్షణకాలం కుదిపి వదిలింది అతడ్ని. తడబాటుకు గురవుతున్న గుండెను అదిమిపట్టుకుంటూ మౌనంగా నిలబడ్డాడు.

"ప్లీజ్ సిడౌన్ మిస్టర్ భార్గవ్" ఆమె మాట్లాడుతూనే వుంది.

"సిన్సియర్‌గా పని చేసేవాళ్ళంటే నేనిష్టపడతాను. బాధ్యత మర్చిపోయిన వాళ్ళంటే నాకు చాలా అసహ్యం. తొమ్మిదిగంటలకి ఆఫీస్. ఈ రోజు కొత్త బాస్ చార్జ్ తీసుకుంటారని తెలుసు. మీ సెక్షన్ గురించి నాకు వివరించాల్సిన అవసరం వుందనీ తెలుసు. అయినా మూడు గంటలపాటు ఆలస్యంగా వచ్చారు. దీనికి మీ సమాధానం ఏమిటి మిస్టర్ భార్గవ్?" కనెక్షన్ రాని ఫోన్‌ని టేబుల్ మీద పడేసి చివ్వున రివాల్వింగ్ ఛైర్‌లో ఇటు తిరిగిందామె.

"మీరింకా నిలబడే వున్నారు. కూ.....చోం.....డి....." ఉన్నట్టుండి మాటలు మింగేసింది అతన్ని చూడగానే... నాలుగు సెకండ్లు ఆలస్యంగా గుర్తించింది.

గుర్తించిన మరుక్షణం చిన్న షాక్.

ముఖం గిర్రున తిరిగినట్టయింది.

తను చూస్తున్నది కలో నిజమో క్షణకాలం అర్థంకాలేదు.

కెవ్వున అరవాలని ఇంతలావున నోరు తెరిచి అలాగే వుండిపోయింది. కొద్దిసేపు గుండె కొట్టుకోవడం నిలిచిపోయినట్టయ్యింది. తెలివి తప్పుతున్న పరిస్థితి నుంచి అతికష్టంమీద నిగ్రహించుకుందామె.

అయిదున్నర అడుగుల ఎత్తున-

పోత పోసిన బంగారు విగ్రహంలా వుందామె.

చాలా సింపుల్‌గా సాదా వాయిల్ చీర జాకెట్ ధరించింది. మెడలో సన్నటి బంగారపు గొలుసు. అంతకుమించి ఏ అలంకరణా లేదు. ఆమె వల్ల ఆ సాదా దుస్తులకే గొప్ప విలువ ఏర్పడినట్టుంది. తుమ్మెద రెక్కల్లా నల్లని జుత్తుతో కూడిన నిడుపాటి వాలుజడ ఒడిలో పడుతుంది.

అదే సమయంలో భార్గవకి అర్థమైపోయింది.

ఆమె తనని గుర్తించిందని-

అది ఎంతమాత్రం అతడు వూహించనిది.

తప్పదు! ఫేస్ చేయాలి.

"మైగాడ్... సత్యా...!" ఎట్టకేలకు గొంతు విప్పి, నమ్మలేనట్టు అడిగింది.

"సారీ మేడమ్! సత్యా ఎవరో నాకు తెలీదు. ఐయాం భార్గవ్" అన్నాడు.

"నో... నువ్వు భార్గవకాదు సత్యావి.... నా సత్యావి."

"అదికాదు మేడమ్...!"

ఆమె అతడి మాటలు విన్పించుకోలేదు.

ఆమె ముఖంలో ఆనందం, దుఃఖం ఒకేసారి చోటు చేసుకుని షాక్‌తో కాలు చెయ్యి ఆడలేదు. ఆ పరిస్థితి నుంచి బయటపడి ఒక్క దూకులో ఛైర్‌లోంచి లేచి ఇవతలకు పరుగెత్తుకొచ్చింది. పారేసుకున్న వస్తువు తిరిగి దొరికినంత ఆనందంగా.

"సత్యా... నువ్వు బ్రతికే వున్నావ్. నువ్వు నా సత్యావి" అనరుస్తూ అతడు వారించే లోపలే విసురుగా వచ్చి అతడ్ని వాటేసుకుంది. గుండెల్లో ముఖం దాచుకుని భోరున ఏడ్చింది.

"సత్యా.... మై లవ్... మై హార్ట్... ఏమైపోయావింతకాలం. నన్ను చూడకుండా ఎలా వుండగలిగావు? నాకు

నమ్మకముంది నువ్వు చావలేదు. నా కోసం బ్రతికే వున్నావు. ఏదో రోజు నువ్వు నా కంట పడతావని నా మనసు చెబుతూనే వుంది. నువ్వు పోయావనుకుని జీవచ్ఛవంలా బ్రతుకుతున్నాను. ఎందుకలా చేశావ్- చెప్పు సత్యా? చెప్పు సమాధానం కావాలి. నువ్వు బ్రతికుండీ నన్నెందుకు చంపేశావు? చెప్పు సత్యా...." అంటూ అతడి కాలర్ పట్టి గుంజుతూ ఏడుస్తుంటే బొమ్మలా నిలబడిపోతూ మనసు రాయి చేసుకున్నాడు భార్గవ్. ఆ ఆనందంలో అతడి మాటలు కూడా పట్టించుకోలేదామె. అతడి ఛాతీమీద ముద్దులు పెట్టేసింది.

"సారీ మేడమ్! ప్లీజ్ రిలాక్స్. బహుశ ఎవరో అనుకుని నన్ను చూసి పొరబాటు పడుతున్నారు. అయాం భార్గవ్. సత్యాన్ని కాదు. ప్లీజ్" అంటూ ఆమెను తననుంచి లాగి నిలబెట్టాడు.

అతడి కళ్ళలోకి సూటిగా చూసిందామె.

కాస్త గడ్డం పెరిగినంత మాత్రాన తన సత్యాను గుర్తించలేదా?

"నేను పొరబడుతున్నానా... నువ్వు సత్యావి కాదా? మేఘా అంటూ నువ్వు మనసారా పిలిచే నీ మేఘనని మర్చిపోయావా? నిన్ను గుర్తుపట్టలేనంత అమాయకురాలినా చెప్పు సత్యా... ఏమైంది నీకు?" వర్షంలా కురుస్తున్న కన్నీళ్ళతో నిలదీసింది.

"అయాం వెరీ వరీ సారీ మేడమ్. మీరు ఖచ్చితంగా పొరబాటు పడుతున్నారు. మీ సత్య ఎవరో నాకు తెలీదు. అయాం భార్గవ్" అన్నాడు మొండిగా.

"నో... నమ్మను. నేన్నమ్మను. నువ్వు సత్యావి" అంటూ విసవిసా టేబుల్ వద్దకెళ్ళి ఇంటర్‌కం ఆన్ చేసింది.

"ఎస్ మేడమ్!" అవతలినించి సరళ గొంతు విన్పించింది.

"సరళా... ప్లీజ్, నేను చెప్పేవరకు నా ఛాంబర్‌లోకి ఎవరినీ పంపించకు. నువ్వు కూడా రావద్దు" ఆర్డర్ వేసింది.

"ఎస్ మేడమ్" అని లైన్ కట్ చేసింది సరళ.

"ఓకే మేడమ్. నే వెళతాను" పోబోయాడు.

"ఆగండి మిస్టర్... భార్గవ్. మనం చాలా విషయాలు మాట్లాడుకోవాలి. ప్లీజ్! అలా కూర్చోండి" పైట చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ ఛైర్ చూపించింది.

క్షణం తటపటాయించి చివరకు బలవంతంగా కూర్చున్నాడు. మేఘన తిరిగి తన సీట్లోకి వచ్చి కూర్చుంది.

ఆమెకు ఎదురుగా అతడు.

ఇబ్బందిగా ముఖం తిప్పుకున్నాడు.

సూటిగా అతడ్నే చూస్తోంది.

"సో... మీరు మిస్టర్ భార్గవ్ అంటారు. సత్యా కాదు?" అడిగింది.

"మీరెందుకు పొరబాటు పడుతున్నారో తెలీడంలేదు మేడం. సత్య ఎవరో నాకు తెలీదు. బహుశ అతడి పోలికలు నాలో వుంటే అది నా తప్పుకాదు. సో... ప్లీజ్ లీవిట్" అన్నాడు అయిష్టంగా.

"ఓకే! ఓకే! మీరు ఎంత కాలంగా ఈ కంపెనీలో పనిచేస్తున్నారు?"

"మూడున్నర సంవత్సరాలు."

"అంతకుముందు..."

"అది అవసరమా? నేనిక్కడ ఉద్యోగిని. ఇష్టమైతే వుంచండి లేదంటే తీసేయండి. ఐ డోంట్ కేర్. అనవసరమైన ప్రశ్నలతో మీరు నన్నిబ్బంది పెట్టడం బాగలేదు" అంటూ జేబులోంచి ఒక లెటర్ తీసి ఆమె ముందుంచాడు.

"ఏమిటిది?" అడిగింది.

"నా రాజీనామా లెటర్. మీరు అంగీకరిస్తే సంతోషిస్తాను."

భారంగా నిట్టూర్చిందామె.

అప్పటికి మానసికంగా కాస్త నిలదొక్కుకుంది.

అతడు తన సత్యా... అందులో సందేహం లేదు.

అతడు బ్రతికున్నాడన్న ఆనందంకన్నా అతడు తను సత్య కాదని బుకాయించటం చాలా బాధ కలిగిస్తోంది. ఒకవేళ ఆనాటి ప్రమాదంలో తలకు బలమైన దెబ్బ తగిలి గతం మర్చిపోయాడా... తనని కూడా?

సీరియస్‌గా ఆలోచిస్తూనే అతడ్ని చూస్తూ...

ఆ రాజీనామా లెటర్ తీసుకుని నిలువునా రెండుగా చింపి చెత్తబుట్టలో పడేసింది. "మిస్టర్ భార్గవ్. నీ రాజీనామా మాత్రమే కాదు, మూడేళ్ళ వరకు ఎవరి రాజీనామా కంపెనీ అంగీకరించదు. ఎందుకంటే, ఇక్కడి ఎంప్లాయిస్ క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని గత యాజమాన్యం ఓనర్‌షిప్ మారిన తర్వాత కూడా మూడేళ్ళ వరకు ఎవరిని ఉద్యోగం నుంచి తీసేయకూడదని కండిషన్ పెట్టింది. అందుకు అంగీకరిస్తూనే వర్కర్స్‌లో ఎవరూ రాజీనామా చేయకూడదని మేం షరతు పెట్టాం. ఇది మా మధ్య మాట మాత్రం కాదు. రాతకోతల్లో చేర్చబడిన కండిషన్. బహుశ మీకు తెలీదేమో. మీరు రాజీనామా చేయకూడదు."

"నిజమే. కంపెనీ నుంచి ఏదన్నా ఆశించే వాళ్ళకి ఆ భయం. నాకా భయం లేదు. మీరు నా రాజీనామాను అంగీకరించినా, లేకున్నా నేను ఉద్యోగం నుంచి తప్పుకోగలను."

"ఎందుకు తప్పుకోవాలనుకుంటున్నావు? ఎందుకు?" గయ్‌మంది మేఘన.

"చెప్పు సత్యా. ఎందుకీ నాటకం? నాకు భయపడే ఉద్యోగం మానేయాలనుకుంటున్నావా? నేనేం పాపం చేశాను" అందుకుంది.

"మీరు మళ్ళీ మొదటికొస్తున్నారు. అయాం భార్గవ్. సత్యాని కాను" విసుగ్గా అరిచాడు.

విషాదంగా నవ్విందామె.

"సత్యా... ఎందుకు బుకాయిస్తున్నావ్? ఎందుకు మోసం చేస్తున్నావ్? నీకు తెలీదా? నీ ఒంటి మీద ఎన్ని పుట్టుమచ్చలున్నాయో నాకు తెలుసు. అలాంటప్పుడు ఈ చేతిమీది పుట్టుమచ్చ గుర్తుపట్టలేనా? ఇంతకన్నా ఏం సాక్ష్యం కావాలి నా సత్యని నువ్వేనని చెప్పటానికి" అంటూ అతడి కుడిచేతి మణికట్టు మీదవున్న కందిబద్ద ప్రమాణంలోని నల్లని పుట్టుమచ్చ మీద ముద్దుపెట్టుకుంది.

ఆ చేతిని అలాగే చెంపకు ఆన్చుకుంది.

అతడి సమాధానం కోసం ఎదురుచూడకుండా తనలో తనే చెప్పుకుపోసాగింది.

"సత్యా... నేనింకా ఎందుకు బ్రతికున్నానో తెలుసా? టింకూ కోసం. మన టింకూ కోసం. అన్నట్టు టింకూ ఎవరో నీకు తెలీదు కదూ? సరిగ్గా ఆనాడు నీకు కారు యాక్సిడెంటు జరిగిన రోజుకి నాకు మూడోనెల. మన పెళ్లికి ముహూర్తం నిశ్చయించిన రోజునే ఈ రహస్యం చెప్పి నీ ముఖంలో సంతోషం చూసి మురిసిపోవాలనుకున్నాను. ఇంతలోనే విధి మన జీవితాలతో ఆడుకుంది. నీ కారు యాక్సిడెంటయింది. బ్రిడ్జి మీద కారు మాత్రం కన్పించింది. నీ కోసం వారం రోజులు నదిలో గాలించారు పోలీసులు. బాడీ దొరకలేదు. మరణించి వుంటావన్నారు. ఆ నది వద్ద పిచ్చిదానిలా ఎన్ని రోజులు తిరిగానో, ఎంతగా నీ కోసం ఏడ్చానో తెలుసా?" ఏడుస్తూనే వుందామె.

మౌనంగా వింటూండిపోయాడు.

బలవంతంగా దుఃఖాన్ని ఆపుకొని–

తిరిగి చెప్పుకొచ్చింది.

"నా సత్యాన్ని పొట్టనపెట్టుకున్న ఆ నదిమీద నాకు విపరీతమైన కోపం. నదిలో దూకి నేను చావాలనుకున్నాను. పెదనాన్న, బాబాయి అతా కాపలా వుండి నన్ను రక్షిస్తూ వచ్చారు. అయినా చచ్చిపోయేదాన్నే కాని నా కడుపులో రూపం దిద్దుకుంటున్న నీ రక్తం నన్ను చావకుండా అడ్డుపడింది.

చాలామంది సలహా యిచ్చారు. పెళ్ళిగాకుండానే బిడ్డతల్లి అయితే రేపు వీళ్ళ భవిష్యత్తు ఏమిటి? అబార్షన్ చేయించండని. కోట్ల ఆస్థికి వారసురాలు. ఈ ఖర్మేమిటి అని ఆక్షేపించారు. పెదనాన్న కూడా అదే సలహా యిచ్చాడు. ఏవరేం చెప్పినా ఎందరు ఆక్షేపించినా నేను లెక్కచేయలేదు. అవమానాలు భరించాను. నువ్వులేని దుఃఖాన్ని దిగమింగాను. టింకూకి జన్మనిచ్చాను. ఇప్పుడే వాడే నా ప్రాణం. వాడికిప్పుడు మూడు పూర్తయి నాలుగో సంవత్సరం. టింకూ అసలు పేరేమిటో తెలుసా? సత్యతేజ. నిన్ను వాడిలో చూసుకుని బతుకుతున్నాను. ఈ కంపెనీ కొనటం విజయవాడ నుంచి నేనిక్కడికి రావడం అదృష్టమైంది. నిన్ను చూడగలిగాను."

బార్గవ్ ఏదో చెప్పబోయాడు.

చెయ్యెత్తి వారించింది.

"వద్దు సత్యా ప్లీజ్! నన్ను మాట్లాడనీ. నా మనసులో బాధ నీకు చెప్పుకోనీ. నిన్ను చూడగానే ఎంత ఆనందించానో తెలుసా? ఆనందమంతా ఒకే ఒక్క మాట నేను సత్యని కాదు అని తుడిచేశావు. ఎందుకు? నేను నా బిడ్డ చేసిన పాపం ఏమిటి? నువ్వు గతం గుర్తుండే మాట్లాడుతున్నావా లేక గుర్తుండి కూడా అలా నటిస్తున్నావా నాకేమీ అర్థంగావడం లేదు. ఆ ప్రమాదం నుంచి బయటపడిన వాడిని యిలా అజ్ఞాతంలోకి ఎందుకెళ్ళిపోయావ్? నేను నీ ఎడబాటును తట్టుకోలేనని తెలీదా... అంటే... నీ మనసులో ఏదో వుంది. నా మీద కోపం వుంది. ఎందుకు? కనీసం నాతో చెప్తే నా తప్పుంటే సరిదిద్దుకుంటాను సత్యా! కాని నన్ను నిరాదరించకు. నువ్వుండి కూడా మమ్మల్ని లేనివాళ్ళని చేయకు. ఐ లవ్ యూ సత్యా.... అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ నిన్నే ప్రేమిస్తున్నాను. నువ్వు తప్ప నాకీ లోకంలో ఏమీ వద్దు. దయచేసి నేనెవరో తెలీదనకు సత్యా! తట్టుకోలేకపోతున్నాను.... తట్టుకోలేను..." అంటూ అతడి చేతిని గుండెలకు హత్తుకొంటూ టేబుల్ మీదకు ఒరిగి పసిపిల్లలా వెక్కి వెక్కి ఏడ్చేసింది.

చిన్నగా చేయి వెనక్కి తీసుకున్నాడు.

ఆ క్షణంలో నిజంగా చలించిపోయాడతను.

తనకే తెలీని నిజం. తనో బిడ్డకు తండ్రి. మేఘనకు కొడుకు పుట్టాడు. తన రక్తం. వాడ్ని చూడాలని ఆరాటం. ఆమెను గుండెలకు హత్తుకుని ఓదార్చాలని ఆశ. కాని అంతలోనే... అతడి కళ్ళముందు గతం తాలూకు నీలి మబ్బులేవో నిలిచి అతడి ఆవేశాన్ని అడ్డుకున్నాయి. మనసును రాయి చేసుకున్నాడు.

"ఓకే మేడమ్! మీరు నాకు ఎందుకు చెప్తున్నారో అర్థం చేసుకోగలను. బట్! అయాం నాట్ యువర్ సత్యా. అయాం భార్గవ్. సీ యూ లేటర్. థాంక్యూ! నే వెళుతున్నాను" అంటూ లేచి చరచరా డోర్‌వైపు అడుగులేసాడు.

"సత్యా... ఆగు. ప్లీజ్!" లేచి చరచరా ఇవతలికి వస్తూ ఆర్తిగా అర్థించింది.

మనసు వెళ్ళిపోవాలని పీకుతున్నా–

పాదాలు బ్రేక్ వేసినట్టు ఆగిపోయాయి.

ఆ పిలుపు.. సత్యా అంటూ ఎంతో ప్రేమగా పిలిచే ఆ మధురమైన పిలుపు తన నరనరాన తేనెలు నింపిన సుమధుర సంగీతంలాంటి ఆమె పిలుపు... తను మర్చిపోగలడా... కాని... నటించటం ఆడవాళ్ళకు వెన్నతో పెట్టిన విద్య. ఆమె నటించటం లేదన్న గ్యారంటీ ఏముంది?

ఆగి తిరిగి చూసేలోపలే–

సుడిగాలిలా దూసుకొచ్చి అతడి పాదాలకు చుట్టుకుపోయింది మేఘన. కన్నీళ్ళతో అతడి పాదాలు కడిగింది.

"ప్లీజ్ సత్యా. నన్ను కాదనకు సత్యా. చచ్చిపోతాను. నిన్ను చూసిన ఈ ఆనందాన్ని శాశ్వతం చేయవా? నేనేం తప్పు చేశాను? ఎందుకీ నిరాదరణ... నా నేరం ఏమిటో చెప్పవా, చెప్పు సత్యా. తట్టుకోలేకపోతున్నాను" అంటూ ఏడ్చేసింది.

భార్గవ మనసు ద్రవిస్తోంది.

జాలితో గుండె కరిగిపోతోంది.

క్షణం ఆగితే ఆమెను లేపి గుండెలకు హత్తుకునే ప్రమాదం వుందని గ్రహించి పాదాలు వెనక్కి తీసుకున్నాడు. ముఖంనిండా కఠినత్వం నింపుకొంటూ– "మేడమ్ ఏమిటిది? నాన్సెన్స్. మీకేమన్నా పిచ్చా? మీరెక్కడ నేనెక్కడ. ఆఫ్టాల్ మీ దగ్గర పనిచేసే జీతగాడ్ని. నా ముందు మీరిలా... షేమ్ టూ యూ. నేను సత్యాను కాదంటున్నా నా గోడు విన్పించుకోరే. ప్లీజ్ కంట్రోల్ యువర్‌సెల్ఫ్. ఇంకెప్పుడూ నన్ను సత్యని పిలవకండి. నన్ను భార్గవ్‌గానే వుంచండి. నేను ఉద్యోగం వదిలి వెళ్ళిపోయే పరిస్థితి తీసుకురావద్దు. ప్లీజ్..." అని ఇక క్షణం కూడా అక్కడ వుండకుండా చరచరా వెళ్ళి డోర్ తీసుకుని విసురుగా బయటికెళ్ళిపోయాడు.

అతడు వెళ్ళిన కాసేపటివరకు అక్కడ అలాగే దిగాలుగా కూచునుండిపోయింది మేఘన. చివరికి ఒక నిశ్చయానికొస్తూ కళ్ళు తుడుచుకుంది. అతడు నిలబడిన చోటును కళ్ళకు అద్దుకుని లేచి అటాచ్డ్ బాత్‌రూంలోకెళ్ళి ముఖం కడుక్కుని ఫ్రెషప్ అయి వచ్చి తన సీట్లో కూచుంది.

ఆమె ఒక నిశ్చయానికి వచ్చేసింది.

అతడు భార్గవ్ కాదు– సత్య. అందులో సందేహం ఎంతమాత్రం లేదు. కాని ఎందుకిలా జరిగింది? పేరు మార్చుకుని, వూరు మార్చుకుని అజ్ఞాతంలో ఎందుకున్నాడు? తనను గుర్తించి కూడా తెలీనట్టు నటిస్తున్నాడు. అందులో కూడా సందేహం లేదు. అంటే ఆ రోజు యాక్సిడెంట్ తర్వాత కావాలనే అతను తనకు దూరంగా వచ్చేసాడు. ఎందుచేత? తనకు తెలిసి తమ మధ్య ఎలాంటి అభిప్రాయబేధాలు విడిపోయేనాటికి లేవు. తను ఏ తప్పూ చేయలేదు. అప్పుడు ఇప్పుడు ఎప్పుడు సత్య తన గుండెల్లోనే వున్నాడు. మరి పొరబాటు ఎక్కడ జరిగింది?

సత్య ఇలా ప్రవర్తించటానికి ఖచ్చితంగా ఏదో కారణం వుంది. అదేమిటో తెలుసుకోకుండా అతన్ని మార్చలేదు. అతడి మనసులో ఏముందో తెలుసుకోవాలి. ఒకవేళ...

రాకూడదని అనుమానం వచ్చింది మేఘనకి.

సత్య మరో అమ్మాయిని ప్రేమించాడా? ఆమెను పెళ్లి చేసుకుని ఇక్కడ సెటిలయిపోయాడా? అందుకే ఇలా ప్రవర్తిస్తున్నాడా... నో సత్య తనని మర్చిపోయి మరో అమ్మాయిని చేసుకున్నాడంటే తాను నమ్మలేదు. కోట్ల ఆస్థిని, తనను అతడి చేతుల్లో పెట్టి అతన్ని తన గుండెల్లో దాచుకుంది ఈ మేఘన. అలాంటి అన్యాయం తనకు చేస్తాడా?

ఆలోచించి లాభం లేదు.

భార్గవగా అతడి వివరాలు ముందు తెలుసుకోవాలి.

ఇంటర్‌కమ్ ఆన్ చేసి సెక్రటరీని పిలిచింది.

"సరళా... ఓసారి లోనకి రా" అంది.

పది సెకన్ల తర్వాత సరళ లోనకొచ్చింది.

"సరళా! మిస్టర్ భార్గవ అపాయింట్‌మెంట్ ఆర్డర్‌కి సంబంధించిన ఫైలు నాక్కావాలి. అర్జంట్!" చెప్పింది.

"ఓకే మేడమ్! పది నిమిషాల్లో వెదికి తెస్తాను" అంటూ చరచరా బయటికెళ్ళింది సరళ.

తిరిగి ఆలోచనల్లో మునిగిపోయింది మేఘన.

✦ ✦ ✦ ✦ ✦

**End of Preview.**

**Rest of the book can be read @**
**http://kinige.com/book/Dreams**

* * *